# బుర్ర తిరిగిన రచయిత !

కుమార్ పత్రికల్లో కథలు చదివి చదివి ఈ కథలు నేను వ్రాయ లేకపోతానా అనుకున్నాడు. అనుకోవడమే తడవుగా వ్రాయడం మొదలు పెట్టి, తెగవ్రాసేశాడు. పత్రికల యడ్రసులు సంపాదించాడు. సాధ్యమైనంత చిన్న కథలు వ్రాస్తే పత్రికలలో ప్రచురణ అవకాశం ఎక్కువని కొందరు చెప్తే అలాగే చిన్న కథలే వ్రాశాడు.

రోజుకు ఒక కథ చొప్పున పది రోజుల్లో పది కథలు వ్రాసి, అంతటితో ఆపేసి, పది పత్రికలకు తిరుగుటపా కవర్లు పెట్టి పంపించేడు. అక్కడ నుంచి కుమారస్వామికి అసలు కష్టాలు మొదలయ్యాయి.

రోజూ పోస్టుమాన్ కోసం ఎదురుచూడటం, తన రచన కోసమే పత్రికల వాళ్లు ఎదురుచూసినట్లు కవరు తెరవగానే వేసుకున్నట్లుగా, తరువాత వారం పత్రికలు రాగానే వాటిలో తన రచన వుందేమోనని చూసుకోవడం.

ఇలా వుంది పరిస్థితి.

విశాఖ పత్రికకు ఒక మంచి కథ పంపాడు. కథానాయిక ఎంతో అందంగా వుంటుంది. ఆమెను రౌడీలు వేధిస్తారు. అయినా చాకచక్యంగా పోలీసులకు పట్టిస్తుంది. ఈ కథ తప్పక ప్రచురిస్తారు. ప్రచురిస్తే బాపు బొమ్మవేస్తారు, అబ్బ ఎంత బాగుంటుంది.

'జనప్రియ' కు మరో పెద్ద కథ పంపించేడు. అదీ మంచి కథే. భార్యాభర్తలు తగువు చివరికి వాళ్లు సఖ్యమైపోతారు. దీన్ని కూడా తప్పక ప్రచురిస్తారు.

ఆంధ్రమాతకు మంచి సందేశాత్మక కథ పంపాడు. ముచ్చటగా మూడు రంగుల్లో వేస్తారు వాళ్ళు. ఎప్పుడూ కథలు అలాగ తన కథ ప్రచురిస్తే, ఓహో, దానికి వందరూపాయలు పారితోషికం. తన శ్రీమతి ముందు మీసాలు దువ్వేసి నువ్వు చీర కొనుక్కోవోయ్ సంక్రాంతికి కట్టుకుందువు అని చెప్పవచ్చు.

సోమవారం పత్రికకు మరో కథ పంపించాడు. ఆ పత్రికలో ఆఫీసు రాజకీయాలు, కథలు వస్తాయి. అందుకని అలాంటి కథ వ్రాశాడు.

ఇంకా కొన్ని పత్రికలకు కథల పోటీకి కూడా తను కథలు పంపాడు. కారణం బహుమతి వచ్చిన వాళ్ళందరూ ఇది నా తొలి రచన అంటూంటారు. అలాగే తన కథకు బహుమతి వచ్చిందనుకో తన కార్యాలయంలో అందరూ తనకు బ్రహ్మరథం పట్టెయ్యరూ.

"ఎందుకండీ ఇలా కథలకోసం పోస్టేజీ దండగ" అనే శ్రీమతి దగ్గరుండి మరీ కథలు వ్రాయిస్తుంది.

ఇలా వున్నాయ్ కుమార్ ఆలోచనలు.

ఆఫీసునుండి ఇంటికి వస్తున్నాడు కుమార్.

ఇంటి తలుపు తట్టబోయి లోపల మాటలు వినిపిస్తుంటే ఆగేడు. తన భార్య గొంతు వినిపిస్తోంది.

"ఏమేవ్ ఈ మధ్యన మీ బావగార్కి కొత్త జబ్బొచ్చింది.

"ఏమిటక్క మొన్న వచ్చినప్పుడు బాగానే వున్నాడే?" తన మరదలు గొంతు, వచ్చినట్లుంది ఊర్నించి.

"జబ్బు కాదే బాబూ కథలు రాస్తున్నారు. దాదాపు అన్ని పత్రికలకు కథలు రాసేసి పంపించేశారు. అవి అవతల కోర్టులోంచి బంతి వచ్చినట్టు అన్నీ ఒకేసారి ఇవ్వాళ తిరిగొచ్చేశాయి. పాపం ఇంకాసేపట్లో వస్తారు. ఆయన ముఖం చూడాలి. నువ్వేం అనకు" అంటూంది శ్రీమతి.

కుమార్ తిరుగు ముఖం పట్టేడు "రాత్రికి సెకండ్ షో చూసుకుని ఇంటికి వెళ్తే ఎవరి ముఖం చూడక్కర్లేదు. ప్రొద్దున సంగతి చూసుకోవచ్చు" అనుకుంటూ.

—o—